సాక్షి
అనంతపురం
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



పాలక మండళ్ల నియామకం

ఎస్కేయూ, జేఎన్‌టీయూ (అనంతపురం) నూతన పాలక మండలి సభ్యులను నియమించారు.

IIలో



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత పెరిగింది. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

శ్రీసాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సీజ్



శ్రీసాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: మానసిక వైద్యం అందించడానికి క్లినిక్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న ఓ వైద్యుడు అనుమతి రాకుండానే శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పేరు మీద సాయినగర్ 6వ క్రాస్‌లో ఓ ఆస్పత్రిని నడుపుతున్నాడు. శుక్రవారం ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ అక్కడి పరిస్థితులను చూసి ఆశ్చర్యపోయారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయడంతో పాటు అబార్షన్‌కు వినియోగించే వస్తువులు, మందులు, వాడేసిన వైద్య సామగ్రి చూసి నివ్వెరపోయారు. పదుల సంఖ్యలో యువతులకు చికిత్స చేసినట్లు గుర్తించారు. అందుకు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రిని నిర్వహిస్తున్న బాలాజీ (ప్రభుత్వ వైద్యుడు, జీజీహెచ్)కి డీఎంహెచ్‌ఓ భ్రమరాంబాదేవి షోకాజ్ నోటీసు జారీ చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు.

సంజీవిని ఆస్పత్రికి షోకాజ్ నోటీసు

ఏడాదైనా రెన్యూవల్ చేసుకోకపోవడంతో నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న సంజీవిని ఆస్పత్రి నిర్వాహకులు పవన్‌కుమార్‌కు డీఎంహెచ్‌ఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

మాత్రికాస్ ఫర్టిలిటీ సెంటర్‌పై ఆరా

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చంద్ర ఆస్పత్రిలోని మాత్రికాస్ ఫర్టిలిటీ సెంటర్‌ను వైద్య బృందం తనిఖీ చేసింది. అనుమతులు రాకుండానే వైద్యం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకుని అనుమతులు రాకున్నా ఆస్పత్రిని నిర్వహించవచ్చని డాక్టర్ తస్వీన్‌కౌర్ సమాధాన మిచ్చారు. శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ, మాత్రికాస్, సంజీవిని ఆస్పత్రుల నివేదికలను కలెక్టర్ గౌతమికి సమర్పించి, కలెక్టర్ ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

ఓట్ల పునఃపరిశీలనకు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్: తొలగించిన ఓట్ల పునఃపరిశీలన గడువును ఎన్నికల కమిషన్ ఈనెల 6వ తేదీ వరకు పొడిగించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. జిల్లాలో 2022, జనవరి 6 నుంచి గత నెల 9వ తేదీ వరకు తొలగించిన ఓట్లు 96,153 ఉన్నట్లు గుర్తించారు. ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు పునఃపరిశీలన గత నెల 28న ప్రారంభించి 30 లోగా పూర్తి చేయాల్సి ఉంది. ప్రతి ఓటు తొలగింపును బీఎల్‌ఓ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈఆర్‌ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) నియోజకవర్గం పరిధిలో 1,000 ఓట్లు పరిశీలించాలి. ప్రత్యేక అధికారి 500 ఓట్లు పరిశీలించాలి. కలెక్టర్ ప్రతి నియోజకవర్గంలోనూ 100 ఓట్లు పరిశీలించాల్సి ఉంది. అయితే. పునఃపరిశీలనకు ఇచ్చిన మూడు రోజులు గడువు సరిపోదని ఎన్నికల కమిషన్ దృష్టికి ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. దీంతో తొలగింపు ఓట్ల పునఃపరిశీలనకు గడువును ఎన్నికల కమిషన్ ఈనెల 6 వరకు పొడిగించింది.

పంటలకు వాడొద్దు

అనంతపురం సెంట్రల్: గుంతకల్లు నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రమే గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)కు నీటిని విడుదల చేశామని హెచ్చెల్సీ ఈఈ మోహనమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు విడుదల చేస్తున్న నీటితో పంటలు సాగుచేయకూడదని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సాగునీటి అవసరాలకు వినియోగించినా, ఆటంకాలు ఏర్పరచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల నిర్మాణానికి భూమి వితరణ



డిప్యూటీ తహసీల్దార్‌కి భూమి పత్రాలను అందజేస్తున్న రాజగోపాల్ దంపతులు

కుందుర్పి: కుందుర్పి జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల నిర్మాణానికి 1.65 ఎకరాల భూమిని జెడ్పీటీసీ మాజీ సభ్యులు రాజగోపాల్ దంపతులు విరాళంగా అందజేశారు. కసాపురం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 58/3 లోని 1.65 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులను శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డి, స్థానిక సర్పంచ్ మారుతేశ్వరి, గంగమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కారు.. జోరు

కారు..గతంలో స్టేటస్ సింబల్. ఉన్నత వర్గాల వారి ఇళ్ల ముందే కనిపించేది. కానీ నేడు వీధిలో కనీసం 10 కార్లు కనిపిస్తున్నాయి. కరోనా తర్వాత చాలా కుటుంబాలు బస్సులు, రైళ్లు తదితర వాటిల్లో ప్రయాణించడం మానేశాయి. చిన్నదో, పెద్దదో ఓకారు కొనేస్తున్నారు. కుటుంబమంతా వెళ్లాల్సి వస్తే కాస్తంత దూరమైనా సరే కార్ల లోనే రయ్యిమంటూ దూసుకుపోతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కార్ల అమ్మకాలు భారీ పెరిగాయి. ప్రపంచమంతా ఇదే పరిస్థితి ఉడటంతో ఉమ్మడి జిల్లాలో తయరయ్యే కార్లు, కార్ల విడిభాగాలు భారీగా ఎగుమతి అవుతున్నాయి.



- ఎగుమతుల ఖిల్లా 'అనంత'
- ఉమ్మడి జిల్లాలో భారీగా కార్ల ఉత్పత్తి
- కార్ల విడిభాగాల తయారీ ఎక్కువే
- భారీగా పెరిగిన కార్ల విక్రయాలు
- రూ. 500 కోట్లకుపైగా ఎగుమతులు
- 31 దేశాలకు కార్ల విడిభాగాల ఎగుమతులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కార్ల ఎగుమతులు అనూహ్యంగా పుంజుకున్నాయి. అదేస్థాయిలో కార్ల కొనుగోళ్లు పెరిగాయి. కరోనా అనంతరం మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ మంది కార్లలో ప్రయాణించడానికి మొగ్గు చూపుతుండటంతో ప్రతి ఇంటిముందూ కారు కనిపిస్తోంది. మరోవైపు కార్ల తయారీ, ఎగుమతులు, కార్ల విడిభాగాల ఎగుమతులు ఊపందుకున్నాయి.

పెరిగిన ఎగుమతులు

ప్రపంచ వ్యాప్తంగా కార్ల వినియోగం పెరిగింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో తయారయ్యే కార్లు, కార్ల విడి భాగాల ఎగుమతులు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.వేల కోట్ల టర్నోవర్ జరిగింది. ఇక్కడ తయారైన పలు వస్తువులు 92 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తయారవుతున్న కార్ల విడిభాగాలు 31 దేశాలకు వెళ్తాయి. దీన్ని బట్టి కార్లకు ఎంత డిమాండ్ ఉందో అంచనా వేయవచ్చు.

ఊపందుకున్న కార్ల కొనుగోళ్లు

ఉమ్మడి జిల్లాలో కొత్త కార్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కరోనాకు ముందు పరిస్థితికీ.. ఇప్పటికీ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఒకప్పుడు కారు కొనాలంటే కనీసం రూ.50వేలపైగా వేతనం ఉంటేనే ఆలోచించేవారు. ఇప్పుడలా కాదు. చిరువ్యాపారులు కూడా కారు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. బ్యాంకులు కూడా పిలిచి మరీ వెహికల్ లోన్లు ఇస్తుండటంతో కార్లు కొనేవారి సంఖ్య బాగా పెరిగింది. ముఖ్యంగా రూ.10 లక్షల్లోపు విలువైన కార్లకు భారీగా మార్కెట్ ఏర్పడింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 400 నుంచి 450 కార్ల వరకూ అమ్ముడవుతున్నట్టు అంచనా.

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లా నుంచి కొన్ని ఎగుమతులు..వాటి విలువ ఇలా..

కేటగిరీ	ఎగుమతుల విలువ (కోట్లలో)
స్పార్క్ ఇగ్నీషియన్ ఇంజిన్ కారు	880.98
మోటార్ కార్ విత్ 1,000 సీసీ	130.77
మోటార్ కార్ విత్ 1,500 సీసీ	361.84
మోటార్ కార్ విత్ 3,000 సీసీ	434.32
కారు యాక్సెసరీస్	229.89
కార్ల విడిభాగాలు	638.60

ఉమ్మడి జిల్లాలో నెలకు కార్ల అమ్మకాలు	450
నెలకు అమ్మకాల విలువ	రూ.330 కోట్లు
ఏడాదికి సగటున టర్నోవర్ విలువ	రూ.4,000 కోట్లు
వివిధ కంపెనీల షోరూంలు	10 వరకు

మెరుగైన అమ్మకాలు



కరోనా తర్వాత చిన్న కార్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. చాలా మంది కుటుంబ సమేతంగా ప్రయాణం చేయాలంటే కారులో వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. మొత్తంగా కార్ల అమ్మకాలు ఏటికేడూ పెరుగుతూనే ఉన్నాయి. ఇందులో బడ్జెట్ కార్లకు కాస్త డిమాండ్ ఎక్కువగా ఉంది.

–సోమశేఖర్, సర్వీస్ మేనేజర్, టయోటా



కార్ల వినియోగం భారీగా పెరిగింది



గతంతో పోలిస్తే కార్ల వినియోగం భారీగా పెరిగింది. దీంతో స్థానికంగా కార్ల కొనుగోళ్లు, ఇక్కడ తయారయ్యే కార్లు, వాటి విడిభాగాల ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. కోవిడ్ తర్వాత చాలా కుటుంబాలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌వైపు చూడటం లేదు. కాస్తంత దూరమైనా కార్లలో వెళ్లేందుకే ఇష్టపడుతున్నారు.

–నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

ఆదరణ చిట్ ఫండ్స్ నిర్వాహకులపై కేసు నమోదు

- ఎండీ, డైరెక్టర్ అరెస్టుకు రంగం సిద్ధం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వందల మంది ఖాతాదారులను మోసం చేసిన ఆదరణ చిట్‌ఫండ్స్‌పై అనంతపురం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదర్శనగర్‌కు చెందిన ఉమాదేవి అనే ఖాతాదారు రూ.20 లక్షలకు పైగా చిట్స్ వేసింది. చిట్స్ కాలపరిమితి ముగిసినా సదరు ఖాతాదారుకు డబ్బు చెల్లించలేదు. తనకు జరిగిన అన్యాయంపై ఉమాదేవి జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో బాధితురాలి నుంచి ఆధారాలను తీసుకున్న పోలీసులు ఆదరణ చిట్ ఫండ్స్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ నల్లపాటి రామకృష్ణతో పాటు అతని భార్య సంస్థ డైరెక్టర్ కరణం శైలజకుమారి, ఆర్ రాధాకుమారి, కె. సరస్వతమ్మ, డీ. రాజు, డీ. రామానాయుడు, ఆర్.మహేంద్ర, ఎస్.ప్రదీప్ కుమార్, కె.నాగేంద్ర, బి. రాజశేఖర్‌రెడ్డిలపై సెక్షన్ 406, 409, 420, డిపాజిట్‌యాక్ట్, రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసులు కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

అరెస్ట్‌కు రంగం సిద్ధం

ఆదరణ బాధితులు సుమారు 300 మంది ఉన్నారని సీఐ శివరాముడు తెలిపారు. ఆగస్టు 25న కేసు నమోదు చేశామని , ఇప్పటి దాకా 17 మంది బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేశారన్నారు. మిగిలిన వారు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు.

ఆనందమనిపింఛన్

తెల్లవారక ముందే తలుపుతట్టి వలంటీర్లు పింఛన్ డబ్బు అందిస్తుండటం లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపుతోంది. వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో భాగంగా శుక్రవారం వేకువజామునుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, నేతన్న, డప్పు కార్మికులు, చర్మకారులు ఒకటో తేదీనే అందిన పింఛన్ చూసి మురిసిపోయారు. జిల్లాలో మొత్తం 2,79,359 మందికిగాను తొలిరోజే 80.85 శాతం మందికి పింఛన్ అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 7,312 నూతన పింఛన్లను అందిస్తున్నామన్నారు. – అనంతపురం



రాకెట్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న నవవరుడు శేఖర్



పింఛన్ లబ్ధిదారులతో నవవరుడు వీరన్న

వివాహం రోజు పింఛన్ల పంపిణీ

ఉరవకొండ: మండల పరిధిలోని రాకెట్లకు చెందిన వలంటీరు శేఖర్ పెళ్లి అయిన 20 నిమిషాల్లోనే పింఛన్ల పంపిణీ చేపట్టి అందరితో శభాష్ అనిపించుకున్నారు. రాకెట్లకు చెందిన వలంటీరు శేఖర్‌కు వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి చెందిన అఖిలకు శుక్రవారం తెల్లవారుజామున వివాహం జరిగింది. వధువుకు తాళికట్టి 20 నిమిషాలు కాకుండానే శేఖర్ తన క్లస్టర్ పరిధిలోని 28 మంది పింఛన్‌దారులకు డబ్బు పంపిణీ చేసి తిరిగి పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం, అధికారులు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే క్రమంలో ఓ వలంటీర్ తన వివాహం రోజు సైతం పింఛన్ల పంపిణీ చేపట్టి అందరి మన్ననలను పొందారు. మండల పరిధిలోని మొలకలపెంటకు చెందిన వలంటీర్ వీరన్నకు ఈ నెల 2వ తేదీ వివాహం నిశ్చయించారు. 1న ఉదయం కుటుంబ సభ్యులందరూ వీరన్నను పెళ్లికొడుకును చేశారు. ఇంటింటికీ పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సి ఉండటంతో పెళ్లి కొడుకు వీరన్న నిమ్మకాయ గుచ్చిన కత్తిని ఓ చేతిలో పట్టుకొని, మరోచేతిలో ట్యాబ్ పట్టుకొని ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బును పంపిణీ చేశారు. గ్రామస్తులందరూ వీరన్న చిత్తశుద్ధిని మెచ్చుకుంటూ అభినందనలు తెలిపారు.

కౌలు రైతులకు భరోసా



మెగా చెక్ అందజేస్తున్న జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత

- 2,518 మంది అన్నదాతలకు రూ.1.88 కోట్ల లబ్ధి
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జేసీ కేతన్‌గార్గ్ వెల్లడి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ , జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా, పంట నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్‌తో జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పడమే కాదు చేసి చూపుతున్న ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్ పాల్గొన్నారు.

రైతు భరోసా ఇలా...

జిల్లాలో వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా 2,518 మంది కౌలు రైతులకు రూ.7,500 చొప్పున రైతు భరోసా కింద రూ.1,88,85,000 మంజూరు చేశారని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డు కలిగిన 1,913 మంది కౌలు రైతులకు రూ.1,43,47,000, దేవదాయశాఖ భూములను కౌలుకు తీసుకున్న 650 మంది రైతులకు రూ.45.38 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా...

ఈ ఏడాది మే నుంచి ఆగస్టు వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన పంటకు సంబంధించి అర్హులైన 124 మందికి రూ.19.10 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ మంజురు చేశారన్నారు. మే నెలలో 85 మంది రైతులకు సంబంధించి 60.15 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా ఇందుకు రూ.12,48,060 ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. జూన్‌లో 32 మంది రైతులకు చెందిన 23.11 హెక్టార్లలో పంట దెబ్బతింటే రూ.5,52,450, జూలై నెలలో ఏడుగురు రైతులకు సంబంధించి 7.35 హెక్టార్లలో పంట దెబ్బతింటే రూ.1,10,250 ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.


సీఎంకు రుణపడి ఉంటాం



ఏడేళ్ల నుంచి రెండున్నర ఎకరా కౌలుకు తీసుకుని చీనీ, వేరుశనగ పంట సాగు చేస్తున్నా. నాకు సీసీఆర్‌సీ కార్డు ఇచ్చారు. మొదటిసారి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.7,500 లబ్ధి చేకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతు భరోసా ఇచ్చి ఆదుకోవడం సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాము.

–ధనుంజయ, కౌలు రైతు, కమ్మూరు

గతంలో ఎప్పుడూ లేదు



నేను మూడు ఎకరాల కౌలుకు తీసుకుని వేరుశనగ, టమాట పంటలు సాగు చేస్తున్నాను. కౌలు రైతులకూ వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. విపత్తుల కారణంగా పంట నష్టపోతే గతంలో ఎన్నడూ లేని విధంగా అదే సీజన్‌లో రైతులకు పరిహారం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుంది.

– అనిల్‌కుమార్, కౌలు రైతు, కమ్మూరు

పోలీసుల అదుపులో ఏటీఎం దొంగలు

గుత్తి: హర్యానాకు చెందిన ముగ్గురు ఏటీఎం దొంగలను గుత్తి పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. గుత్తి ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో తొండపాడుకు చెందిన చంద్రమ్మ అనే మహిళ గత గురువారం ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేసుకుంటున్న సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డారు. ఆమెను ఏమార్చి, కార్డు తీసుకున్నారు. ఆమెకు నకిలీ ఏటీఎం ఇచ్చారు. అనంతరం ఆమె కార్డుతో రూ.10వేలు డ్రా చేసుకుని ఉడాయిస్తుండగా, స్థానికులు వెంటపడి సత్యేందర్‌సింగ్ అనే వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. మిగతా ముగ్గురూ కారులో ఉడాయించారు. అయితే కర్నూలు టోల్‌గేట్ వద్ద పోలీసులు ఏటీఎం దొంగల్లో ప్రదీప్, కిర్షన్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. మరొకరు ఉడాయించారు. ప్రస్తుతం సత్యేందర్ సింగ్, ప్రదీప్, కిర్షన్‌లు గుత్తి పోలీసులు అదుపులో ఉన్నారు. పట్టుబడిన ఏటీఎం దొంగలను సీఐ వెంకటరామిరెడ్డి విచారిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004. ఫోన్: 08554-226066. ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా శ్రీ జి.విధుర చౌదరి గారు అనంతపురము జిల్లా, గుత్తి మండలం, కరడికొండ గ్రామం సర్వే నెం. 378 నందు 4.0 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డుమెటల్ & బిల్డింగ్‌స్టోన్, ఎం-శాండ్ మైను స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.	శ్రీ జి.విధుర చౌదరి, సర్వేనెం.378, కరడికొండ గ్రామం, గుత్తి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.378, కరడికొండ గ్రామం, గుత్తి మండలం మరియు అనంతపురము జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం మైను విస్తీర్ణం 4.0 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ జి.విధుర చౌదరి, తండ్రి జి.తిప్పన్న, డి.నెం.12-4-28, విద్యుత్‌నగర్, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్ సెల్ : 73965 21881, 99936 66699
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.90.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను మరియు ఎం.శాండ్- 1,43,454 M³/Annum మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 03.10.2023 సమయం : ఉ.11.00 గం।లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, కరడికొండ గ్రామం, గుత్తి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, గుత్తి మండలం, అనంతపురము జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, కరడికొండ గ్రామం, గుత్తి మండలం, అనంతపురము జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క పరుస నెం.7III(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును. సం/-

ప్రదేశం : అనంతపురము
తేది : 01.09.2023

పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా పిలుపు


జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా పనిచేసి, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ అధిష్టానం ప్రకటించిన జిల్లా నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు పైలా నరసింహయ్య సమావేశమయ్యారు. కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పైలా నరసింహయ్యను కార్యవర్గం సన్మానించింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు రానున్న ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో ఏవిధంగా పార్టీని బలోపేతం చేయాలో దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో టికెట్ ఎవరికి అధిష్టానం కేటాయించినా, వారి గెలుపునకు కృషి చేయాలన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని పైలా పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతను చంద్రబాబు ఏవిధంగా ముంచారో ప్రజలకు తెలియజేయాలన్నారు. తమ ప్రభుత్వంలో లక్షలాది మందికి ఉపాధి, అమరావతిలోని ప్రజలకు ఇళ్ల పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి సొంతింటి కల సాకారం చేసేలా ఇళ్ల స్థలాలు పంపిణీ, నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్య, వైద్య రంగంలో జరిగిన సమూల మార్పులను తెలియజేయాలన్నారు. ప్రధానంగా టీడీపీ హయాంలో అరాచక పాలన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనను ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ అధిష్టానం నమ్మకంతో అవకాశం ఇచ్చిందని, దాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శులు కాపు మాధవరెడ్డి, బిక్కి నాగలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు నాయక్, జిల్లా కార్యదర్శులు రాధాకృష్ణ, గోపాల్‌మోహన్, తేజోనాథ్, నాగేంద్ర, ఆంజనేయులు, ఈసీ మెంబర్లు శోభా రాణి, మల్లెల వేణుగోపాల్ పాల్గొన్నారు.

అవినీతికి పరాకాష్ట చంద్రబాబు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: అవినీతికి పరాకాష్ట టీడీపీ అధినేత చంద్రబాబు అని, దేశంలోనే ఇలాంటి కంత్రీ నేత ఇంకొకరు ఉండరని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని గౌడ లేఔట్ వద్ద వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో కలసి విప్ కాపు విలేకర్లతో మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకోవడంలో తెలివిగల దొంగ చంద్రబాబు అని విరుచుకుపడ్డారు. టీడీపీ హాయంలో 2016–2019 మధ్య కాలంలో ఇన్‌ఫ్రా సంస్థల సబ్ కాంట్రాక్టర్ల ద్వారా రూ.118 కోట్లు ముడుపులు చేతులు మారాయని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు వెల్లువెత్తడంతో ఐటీశాఖ విచారణ చేపట్టిందన్నారు. ఇది నిర్ధారణ కావడంతోనే 153 సీ కింద చంద్రబాబుకు నోటీసులు జారీ అయ్యాయన్నారు. అమరావతి నిర్మాణాల్లో ఆయాచిత లబ్ధి పొందడానికి చంద్రబాబు కాంట్రాక్ట్ సంస్థలను మేనేజ్ చేశారన్నారు. దీని బట్టిచూస్తే అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఆయన రూ.వేల కోట్లు దోపిడీ చేశారన్నారు. దేశంలోనే అత్యంత అవినీతిలో ఏపీ నంబర్-1 స్థానంలో ఉందంటూ అప్పట్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ క్రిసర్ట్ అనే జాతీయ సంస్థ చెప్పిందని గుర్తుచేశారు.

'బాబు కు పాపం పండింది'

ఐటీ నోటీసులతో ఈ రోజు పాపం పండిదన్నారు. ఇదే విధంగా ఆయన విచారణ జరిగితే జైలుకు వెళ్లడం తప్పదని విప్ అన్నారు. ఆయన ఆస్తులు కూడా జప్తు చేస్తారని ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఇతర అగ్ర నేతల కాళ్లు పట్టుకునేలా వ్యవహరించారన్నారు. పెళ్లాన్ని చూసుకోలేని వాడు దేశాన్ని ఏమి బాగుచేస్తాడంటూ గతంలో దేశ ప్రధాని మోదీపై అప్పట్లో చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించాడన్నారు. మోదీని గద్దె దింపే వరకు నిద్రపోనని శపథం చేశాడన్నారు. హోంమంత్రి అమిత్‌షా పై రాళ్లు వేయించాడని, ఈ దొంగ వ్యవహారాలు బయటకు వస్తుండడంతో మోదీ బూట్లు నాకేలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. బీజేపీతో దోస్తీ కట్టేలా లోపాయికారి ఒప్పందాలు సాగిస్తూ ఇలాంటి కేసుల నుంచి గట్టెక్కేందుకు పాట్లు పడుతున్నాడన్నారు. ఇలాంటి ద్రోహిని క్షమించరాదన్నారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు, ఎత్తులు పన్నినా ఏదో ఒకరోజు జైలు కెళ్లడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షలు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: ''యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ డిఫెన్స్, (ఎన్‌డీఏ), నావల్ (ఎన్‌ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి.'' అని డీఆర్‌ఓ గాయత్రిదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై డీఆర్‌ఓ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఒక పరీక్ష కేంద్రంలో సీడీఎస్ పరీక్షలు, మరో కేంద్రంలో ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షలు జరుగుతాయన్నారు. మూడు సెషన్లుగా జరగనున్న సీడీఎస్ పరీక్షకు 101 మంది అభ్యర్థులు, రెండు సెషన్లుగా జరగనున్న ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షకు 83 మంది అభ్యర్థులు హాజరు అవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు రూట్ కమ్ లైజన్ అధికారులను, ఇద్దరు ఇన్‌స్పెక్టింగ్ అధికారులను నియమించామన్నారు. యూపీఎస్‌సీ నిబంధనల ప్రకారం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పరీక్షల నిర్వహణ ఇలా...

- జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా సీడీఎస్ పరీక్ష పేపర్-1 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతుంది. పేపర్-2 మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, పేపర్-3 మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.
- బైవర్‌నగర్‌లోని ఆర్‌టీఓ ఆఫీసు పక్కనున్న కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల యూజీ, పీజీ కళాశాల కేంద్రంగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షకు సంబంధించి పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది.

అభ్యర్థులు ముందే చేరుకోవాలి

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి కంటే అరగంట ముందే చేరుకోవాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించరు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డు (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డ్, తదితరాలు) తీసుకురావాలి.

ఎస్కేయూ,జేఎన్‌టీయూ పాలక మండళ్ల నియామకం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ (అనంతపురం) నూతన పాలక మండలి సభ్యులను నియామకం చేశారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జే.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మూడేళ్ల పదవుల్లో కొనసాగుతారు.

జేఎన్‌టీయూ (అనంతపురం)

కేటగిరి	పేరు
సీనియర్ ప్రొఫెసర్ కోటాలో	బి. దుర్గాప్రసాద్
ప్రిన్సిపాల్ కోటాలో	ఎస్. వసుంధర
అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్ కోటాలో	డి. జ్యోతిశ్వరి
లెక్చరర్ కోటాలో	ఎం. రామశేఖర్‌రెడ్డి
అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల లెక్చరర్ కోటాలో	జి. మేరీమాత
నామినేటెడ్ కోటాలో...	
జీవీ మోహన్ కుమార్	(పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల)
డీ.హరిశ్చంద్ర రామ	(చార్టెర్డ్ అకౌంటెంట్)
అంజలి	(ఫ్యాన్‌టసీస్ ఈ- కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్)
ఎం. వంశీ కృష్ణ	(కార్డియాలజిస్ట్)

ఎస్కేయూ (అనంతపురం)

కేటగిరి	పేరు
సీనియర్ ప్రొఫెసర్ కోటాలో	ఎం. మునినారాయణప్ప
ప్రిన్సిపాల్ కోటాలో	ఏ కృష్ణకుమారి
అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్ కోటాలో	జేవీపీఎన్ కేశవరావు
లెక్చరర్ కోటాలో	అనిత
అనుబంధ కళాశాల లెక్చరర్ కోటాలో	ఎస్ .శ్రీలక్ష్మి
నామినేటెడ్ కోటాలో...	
ఆలూరు రామిరెడ్డి	(విజయనగర కళాశాల ఫౌండర్)
దేశాయి మదన్ మోహన్ రెడ్డి	(ద్వారకామాయి కన్‌స్ట్రక్షన్)
ఎస్. ఇలియాజ్ అహమ్మద్	(అడ్వకేట్, అనంతపురం)
కొమ్ము విజయభాస్కర్	(సామాజికవేత్త)

సేవలకు 'ఉత్తమ' గుర్తింపు

- రాష్ట్రస్థాయి ఉత్తమ టీచరు అవార్డుకు ఇద్దరి ఎంపిక


రాధిక


రమణ ప్రసాద్

రాప్తాడురూరల్: విద్యారంగలో ఉత్తమ సేవలకు గుర్తింపు లభించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు జిల్లా నుంచి ఇద్దరు టీచర్లు ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర అధికారులు జాబితాను ప్రకటించారు. రెండు కేటగిరీల్లో మన టీచర్లకు ఈ అవార్డులు దక్కాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో గుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం టీచరుగా పని చేస్తున్న సి.రాధిక, సెకండరీ గ్రేడ్ టీచరు కేటగిరీలో కూడేరు మండలం పి.నారాయణపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం.రమణ ప్రసాద్ ఎంపికయ్యారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

వినూత్న పద్ధతుల్లో బోధన

గుత్తి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం టీచరుగా పని చేస్తున్న సి.రాధిక వినూత్న పద్ధతుల్లో బోధిస్తుంటారు. రూ. 70 వేలు సొంతంగా ఖర్చు చేసి స్కూల్‌లో గణితం ల్యాబ్ ఏర్పాటు చేశారు. గదిలో పెయింటింగ్స్ వేయించారు. దాదాపు 400 ప్రాజెక్ట్‌లు తయారు చేసి ల్యాబ్‌లో ఉంచారు. పిల్లలకు సులువుగా అర్థమయ్యేందుకు యానిమేషన్ వీడియోల రూపంలోనూ గణితం పాఠాలు బోధిస్తున్నారు. బడివేళల తర్వాత తన విద్యార్థుల ఇళ్లకు స్వయంగా వెళ్లి తరచూ విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడుతుంటారు.

ఎక్కడికి వెళ్లినా తనదైన శైలిలో..

కూడేరు మండలం పి.నారాయణపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం.రమణప్రసాద్ ఎక్కడ పని చేసినా తనదైన శైలిలో పనిచేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. 1996లో పుట్లూరు మండలం మడుగుపల్లిలో చేరారు. ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న ఈ ప్రాంతంలో పని చేయాలంటేనే భయపడే రోజులు. రమణప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులతో పాటు గ్రామ పెద్దలను తరచూ కలిసి చదువు ప్రాధాన్యతను తెలియజేశారు. అక్కడి నుంచి నార్పల మండలం మూగే తిమ్మంపల్లిలో ఏకోపాధ్యాయుడిగా ఐదేళ్లు పని చేశారు. ఆ సమయంలో డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడి పచ్చి ఇటుకలతో కాంపౌండ్ వాల్‌తో పాటు బోరు వేయించారు. ఆ తర్వాత బుక్కరాయసముద్రం మండలంలో మండల రీసోర్స్ పర్సన్ (ఎమ్మార్పీ)గా 8 ఏళ్లు పని చేశారు. అనంతరం కణేకల్లు మండలం పెనకలపాడు, అక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న పి.నారాయణపురం పాఠశాలకు వచ్చారు. ఈయన వెళ్లిన సమయంలో ఇద్దరు మాత్రమే టీచర్లు ఉండేవారు. గ్రామస్తులతో సహకారంతో ఇద్దరు వలంటీర్లను విధుల్లోకి తీసుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకు మరో రెండు పోస్టులు మంజూరయ్యాయి.

విద్యుత్‌షాక్‌కు గురై వివాహిత మృతి

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తూ హీటర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై కుళ్లాయమ్మ (35) మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుళ్లాయమ్మ శుక్రవారం ఉదయం వేడినీటికోసం హీటర్ వేసింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ హీటర్ తగిలి విద్యుత్‌షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త గంగయ్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.


పోలేపల్లిలో వ్యక్తి ఆత్మహత్య...

బ్రహ్మసముద్రం : మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన చిన్ననీలప్ప (43) ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. చిన్న నీలప్ప బతుకుదెరువుకోసం బెంగళూరుకు వలస వెళ్లాడు. అయితే గురువారం రాత్రి స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పెరవలిలో వివాహిత ఆత్మహత్య

శింగనమల: మండలంలోని పెరవలిలో సుహాసిని (25) అనే వివాహిత ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ చితంబరప్ప తెలిపిన మేరకు.. పెరవలికి చెందిన సుహాసిని కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం ఘర్షణ పడింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు తలుపులు ధ్వంసం చేసి, ఇంట్లోకి వెళ్లి సుహాసినిని కిందకు దింపి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు తగిలి..


మృతి చెందిన రైతు శ్రీరాములు

ఉరవకొండ: మండలంలోని కోనాపురంలో రైతు శ్రీరాములు (52) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. రైతు శ్రీరాములు తనకున్న రెండు కాడెద్దులను పశువుల పాకకు తీసుకెళ్తుండగా, పాక సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి, కుప్పకూలాడు. హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సుజాత, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సెంటర్ మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యాంబర్ ప్రాజెక్టు తరఫున 45 రోజుల పాటు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ సేల్స్ అసోసియేట్ జాబ్‌రోల్స్, కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైనా శిక్షణ ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత వెంటనే స్థానిక రాజురోడ్డులో ఉన్న కౌశల్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. వివరాలకు సెల్: 93981 54460, 7569659964లో సంప్రదించాలని తెలిపారు.

మద్యం బాబును కనిపెట్టిన మొబైల్


జోసెఫ్‌తో ప్రొద్దుటూరు పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం: మొబైల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపితే ముప్పు తప్పదు...ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు పదే పదే చెప్తుంటారు. అయితే ఒక్కో సందర్భంలో మొబైల్ కూడా అత్యవసరమని గుర్తు చేసింది వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన ఘటన. ఫూట్‌గా మద్యం తాగి కాలువలో పడిపోయిన మద్యంబాబు ప్రాణాలను సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు కాపాడారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన జోసెఫ్..ప్రొద్దుటూరులో వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా మోడంపల్లెలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఫూటుగా మద్యం తాగి, మత్తులో రైల్వే స్టేషన్ సమీపంలోని మురుగు కాలువలో పడిపోయాడు. అతడు కనిపించలేదని బంధువులు టూటౌన్ సీఐ ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. అతడి వద్ద సెల్‌ఫోన్ ఉందని చెప్పారు. దీంతో పోలీసులు సెల్‌ఫోన్ ఆధారంగా లొకేషన్ కనుక్కొని, గాలింపు చేపట్టారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలిసి, సీఐ ఇబ్రహీం హుటాహుటిన కానిస్టేబుళ్లు దామోదర్, గురుశేఖర్‌ను పంపి స్థానికుల సాయంతో బయటికి తీయించారు. అర్ధరాత్రి సమయంలో ప్రొద్దుటూరుకు తీసుకొచ్చి వైద్యం చేయించిన తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్ 20) పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. ఆగస్టు 14న జరిగిన పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య అరుణ కాంతి, హెచ్‌ఓడీలు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ యం. రామశేఖర రెడ్డి, ఆచార్య భువనవిజయ, డాక్టర్ లలిత కుమారి, అజిత పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీ కొని చిన్నారి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం సచివాలయం దగ్గర బొలెరో వాహనం ఢీకొని ఆదిత్యరెడ్డి (5) శుక్రవారం మృతి చెందాడు. కణేకల్లు మండలం నల్లంపల్లికి చెందిన రవికుమార్ రెడ్డి పట్టణంలోని చర్చి ఏరియాలో నివాసం ఉంటున్నాడు. హౌసింగ్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భార్య రోజాకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో నాటువైద్యం చేయించడానికి 74 ఉడేగోళం గ్రామానికి ద్విచక్రవాహనంపై కుమారులు ఆదిత్యరెడ్డి, అథర్వరెడ్డితో కలిసి బయల్దేరాడు. సచివాలయం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపక్కన ఆపాడు. పక్కనే నిల్చున్న బాలుడిని రాయదుర్గం వైపు నుంచి అనంతపురం వైపు వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొనింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉత్తమ వైద్యులుగా ఎదగాలి

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్

అనంతపురం క్రైం: 'రాష్ట్రంలో గుంటూరు, కర్నూలు వైద్య కళాశాలతో పోటీపడుతున్న అనంతపురం వైద్య కళాశాలలో చదివే అవకాశం రావడం గొప్ప విషయం. ప్రతి ఒక్కరూ ఇక్కడి వైద్యులిచ్చే అమూల్యమైన సలహాలను తీసుకుని, ఇష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా ఎదగాలి' అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో 2023–24 బ్యాచ్ వైద్య విద్యార్థులకు మొదటి రోజు తరగతుల్లో భాగంగా ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ కళాశాలలో అంకితభావంతో పనిచేసే బోధనా సిబ్బంది ఉన్నారన్నారు. అపారమైన అనుభవం కలిగిన వైద్య బృందం అందుబాటులో ఉందని, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 107 పీజీ సీట్లు, అత్యుతన్న ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, జీజీహెచ్‌లోని అన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది, జీఎంసీలో డిజిటల్ లైబ్రరీ, తదిత సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, కేన్సర్ కేర్ యూనిట్ ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, డాక్టర్ శ్యాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి , హాజరైన వైద్య విద్యార్థులు

పేదలకు సేవ చేయడమే లక్ష్యం



పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా వైద్య విద్యను ఎంచుకున్నా. నాన్న నెట్టికంటికల్లప్ప, అమ్మ విమలా సరోజిని. నాన్న రైతులకు సంబంధించిన వ్యాపారం చేస్తున్నారు. ఏ వృత్తిలో లేని విధంగా వైద్య వృత్తిని దైవంగా భావిస్తారు. గౌరవప్రదమైన వృత్తిలో బాగా చదివి కార్డియాలిజస్టు కావాలన్నదే లక్ష్యం.

-మారుతి, మెడికో, కొనకొండ్ల

తల్లీబిడ్డలను కాపాడతా..



మా నాన్న డీఎస్ స్వామి కేంద్ర ప్రభుత్వశాఖలో పని చేస్తున్నారు. అమ్మ శారద గృహిణి. కోవిడ్ కారణంతో గతంలో మొదటి అటెమ్ట్‌లో బీడీఎస్ వచ్చింది. అమ్మా, నాన్నల ప్రోత్సాహంతో రెండోసారి మెడిసిన్ సీటు సాధించా. తల్లీ,బిడ్డల ప్రాణాలను కాపాడేందుకు గైనకాలజిస్టు ద్వారానే సాధ్యపడుతుంది. గైనకాలిజిస్టు అయ్యి పేదలకు సేవలందిస్తా.

- హిమహర్షిత, మెడికో, అనంతపురం

క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్



పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన్‌యాదవ్

అనంతపురం క్రైం: నగరంలోని 29, 37, 38, 44 డివిజన్లలో పరిధిలో నూతనంగా పింఛన్ మంజూరైన 628 మంది లబ్ధిదారులకు మేయర్ వసీం పింఛన్ పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్ అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, ప్రతి నెలా మొదటి, రెండు, మూడు రోజుల్లోనే ఇంటి వద్దకే వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, నాయకులు ఖాజా, మధు, జావిద్, శీన, దాదు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలరాజుతో పాటు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కవితాబాయి, ఆనంద్‌బాబు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కురుగుంటకు చెందిన వలంటీర్ నవీన్‌యాదవ్ ఆసుపత్రికి వెళ్లి వారికి పింఛన్ అందజేశారు.

పింఛన్ పంపిణీ



పంపనూరులో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న సర్పంచ్ ఎర్రిస్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో 'వైఎస్సార్ పింఛన్ కానుక' నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం సర్పంచ్ ఎర్రిస్వామి పింఛన్ మొత్తం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... పంచాయతీలో కొత్తగా పది పింఛన్లు వచ్చాయన్నారు. టీడీపీ హయాంలో కేవలం టీడీపీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని, జగనన్న సీఎం అయ్యాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరవుతున్నాయన్నారు. .

భక్తిశ్రద్ధలతో మధ్యారాధన

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనా ఉత్సవాలలో భాగంగా మధ్యారాధన వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. మొదటిరోడ్డులోని రాఘవేంద్ర స్వామి మఠంలో అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకం, తులసీ అర్చన, హస్తోదకం, మధ్యాహ్నం అన్నదాన సేవలు జరిగాయి. అలాగే పాతూరు చిన్న ఆంజనేయస్వామి ఆలయంలో మధ్యారాధన వేడుకలకు భక్తులు పోటెత్తారు. భక్తజనం సందోహం నడుమ లక్ష్మీ నరసింహస్వామి సమేత రాఘవేంద్రస్వామికి పూజోత్సవాలు, రథోత్సవం జరిగాయి.

రూ.30 కోట్ల బకాయిల విడుదల

- సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

అనంతపురం రూరల్: సత్యసాయి తాగునీటి సరఫరా పథకానికి సంబంధించి పంచాయతీలు చెల్లించాల్సిన బకాయిలు విడుదలయ్యాయి. కార్మికులు, అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.30 కోట్ల బకాయిలను శుక్రవారం ప్రభుత్వం విడదల చేసింది. నీటి సరఫరా ఆగిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కార్మికుల సమస్యను ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కూడా సీఎం జగన్, ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు మంజూరు చేయడంతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే అంతర జిల్లా సబ్‌జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే జట్టును ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.వేణుగోపాల్ తెలిపారు. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో అల్లరి మూకలు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ పనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు దందాలు, సెటిల్ మెంట్లు, తప్పుడు ఫిర్యాదులతో సామాన్యుడిని బెదిరించాలని చూస్తే సహించేది లేదన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్ దగ్గర రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ నగరంలో వాహనాలను ఇష్టారాజ్యంగా నడిపినా, రహదారులకు ఇరువైపులా లారీలు, కార్లు పార్కింగ్ చేసినా జరిమానా విధిస్తామన్నారు. నగర శివారు ప్రాంతంతో ముడిపడి ఉన్న నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని దాబాల్లో మద్యం తాగేందుకు అనుమతించినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామేని సీఐ హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి

ఎస్కేయూ ప్రొఫెసర్‌కు సర్వేపల్లి పురస్కారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సోషియాలజీ ప్రొఫెసర్ జీవీ రమణకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారం దక్కింది. తెలంగాణ రాష్ట్రం సాహితీ వేదిక వారు విద్యా రంగం, బోధనా రంగంలో కృషి చేస్తున్న వారికి గుర్తింపుగా ఈ పురస్కారాని ఏటా అందిస్తున్నారు. ఈ నెల 3న తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేయనున్నట్లు పుడమి సంస్థ అధినేత చిలుముల్ బాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



డాక్టర్ జీవీ రమణ

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

రాప్తాడు: పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి సూచించారు. గర్భిణులు, బాలింతలతోపాటు ఐదేళ్లలోపు చిన్నారులకు సైతం సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శుక్రవారం మండలంలోని గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల (సంపూర్ణ పోషణ) వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

అనంతపురం సెంట్రల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ లలిత సూచించారు. శుక్రవారం ఉమానగర్‌లో భారతిస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విష్ణువర్ధిని, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, సుమంగళి, లక్ష్మీనరసమ్మ, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మండలంలోని తలుపూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అవసరమని, పిండి పదార్థాలతో పాటు విటమిన్లు, మినరల్స్ ఉండేలా చూసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో నూతన వలంటీర్లు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు వలంటీర్లు వారధిగా ఉంటూ ఉత్తమ సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా ఎంపికై న 34 మంది వలంటీర్లకు ఎమ్మెల్యే 'అనంత' ఆయన నివాసం ఆవరణంలో నియామక పత్రాలను అందజేశారు.

అర్హులందరికీ పింఛన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రహమత్‌నగర్ ప్రాంతంలో నూతనంగా పింఛన్ పొందిన లబ్ధిదారులకు శుక్రవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఫించన్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, హసీనా బేగం, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, డివిజన్ కన్వీనర్ సుకేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిని తెలియజేయండి

గత టీడీపీ ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగింది. ఆ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఎమ్మెల్యే ఆదేశించారు. శుక్రవారం 50 డివిజన్ పరిధిలోని సచివాలయ కన్వీనర్, గృహసారథులు ఎమ్మెల్యే అనంతను ఆయన నివాసంలో కలిశారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆమె తెలివి బంగారంగానూ..

- చెత్తకుండీలో 60 గ్రాముల బంగారు నగలు
- ఇళ్లంతా కలియదిరిగి వెనుదిరిగిన దొంగలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇంట్లో దొంగలు పడ్డారంటే గుండెల్లో ఎవరికైనా దడ పుడుతుంది. కానీ అనంత శివారు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ డిప్యూటీ తహసీల్దార్ భార్య మాత్రం తాపీగా ఇంటికొచ్చి చెత్త బుట్టలో దాచిన 60 తులాలు బంగారు నగలు తీసుకొని అన్నీ ఉన్నాయని పోలీసులకు చెప్పింది. ఈ ఘటన నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని స్కందాన్సీ సమీపంలోని ఓ ఇంట్లో గత నెల 30న తెల్లవారుజామున జరిగింది. నాల్గో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి వివరాలు తెలిపారు. స్థానిక టమాట మార్కెట్ సమీపంలోని స్కందాన్సీ కాలనీ వద్ద విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ సురేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆగస్టు 29న రాత్రి అత్యవసర పని నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో దాచి ఉంచిన 60 గ్రాముల బంగారు నగలను విశ్రాంతి తహసీల్దార్ భార్య తెలివిగా బీరువాలో నుంచి తీసి చెత్త బుట్టలో దాచింది. ఇంట్లోని మిగిలిన చెత్తాచెదారాన్ని అందులో వేసి వెళ్లిపోయారు. 30న ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానంతో స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోకి వెళ్లిన తహసీల్దార్ సతీమణి తను దాచిన బంగారు నగల మూటను చేతిలోకి తీసుకుని గుండెలకు హత్తుకుంది. మా సొమ్ము పోలేదని పోలీసులకు చెప్పడంతో వారు కూడా ఊపిరి పీల్చుకున్నారు. ఇంటిపై దాడి చేసిన దొంగలకు సంబంధించిన దృశ్యాలు సీసీ పుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు వైఎస్సార్‌కు కళా నీరాజనం

అనంతపురం కల్చరల్: సీనియర్ కళాకారుడు కుమ్మెత్త సోమిరెడ్డి నేతృత్వంలో జిల్లా కళాకారులు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి కళా నీరాజనాలు అర్పించనున్నారు. ఈ మేరకు సోమిరెడ్డి ఓ ప్రకటనలో వివరాలు తెలియజేశారు. వైఎస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా 5.30 గంటలకు జరిగే కార్యక్రమాన్ని మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారన్నారు. అలాగే ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. నివాళి అనంతరం వైఎస్సార్ స్మృతిని తలపించేలా ఆటపాటలతో పాటూ పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

రామగిరి: ఉపాధి హామీ కూలీ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు వైకేపీ ఏపీఎం ఓబులేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు ఉండి ఇంటర్, డిగ్రీ చదివిన వారు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అలాగే 2018– 2023 మధ్య కాలంలో ఏదో ఒక సంవత్సరం ఆ కుటుంబం వంద రోజుల ఉపాధి హామీ పని దినాలు పూర్తి చేసుకుని ఉండాలన్నారు. ఆసక్తి గలవారు 5వ తేదీలోపు స్థానిక ముత్యాలమ్మ మండల సమాఖ్యలో బయోడేటా ఇవ్వాలని సూచించారు. వివరాల కోసం 7702100238, 9182316114 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'అనంత' రైల్వేస్టేషన్ మేనేజర్‌గా అశోక్

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వేస్టేషన్ మేనేజర్‌గా ఎం.అశోక్ కుమార్ నియమితులయ్యారు. గుంతకల్లులోని సీనియర్ డీఓఎం కార్యాలయంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అశోక్‌ను అనంతపురం మేనేజర్‌గా బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మచ్చా రామలింగారెడ్డి

రాప్తాడురూరల్: జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పని చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కొడిమి జర్నలిస్టు కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు, అప్రోచ్ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మచ్చా మాట్లాడుతూ జర్నలిస్టుకాలనీలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్ , అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ గౌతమికి జర్నలిస్టు కుటుంబాల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతపురం రూరల్ మండల వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుకాలనీ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

పకడ్బందీగానే ఓటరు జాబితా

అనంతపురం టవర్‌క్లాక్: గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటరు జాబితా ప్రక్రియ పకడ్బందీగా తయారు చేయడంలో కలెక్టర్ గౌతమి చొరవ తీసుకున్నారని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. తూతూ మంత్రంగా ఓటర్ల పునః పరిశీలన అంటూ పచ్చ మీడియా పిచ్చి రాతలు రాస్తోందని, ఇది కూడా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

మల్బరీతో అధిక దిగుబడులు

రాప్తాడు: జిల్లాలో చాలా మంది రైతులు వేరుశనగ పంటను సాగుచేసి నష్టపోతున్నారు. వేరుశనగ పంటకు స్వస్తి పలికి మల్బరీ పంటను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి డి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని భోగినేపల్లి గ్రామంలో ఆర్‌కేవీవై పథకం కింద వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమంపై మల్బరీ రైతులకు అవగాహన కల్పించారు.

రేపు ఆచార్య తుమ్మపూడి సంస్మరణ సభ

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు సంస్మరణ సభను ఈ నెల 3న ఆయన శిష్యబృందం నిర్వహిస్తోంది. ఈ మేరకు నిర్వాహకులు నానీల నాగేంద్ర ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగే తుమ్మపూడి సంస్మరణ సభకు సాహితీ అభిమానులు తరలిరావాలని కోరారు.

సంక్షిప్తం

సెలవులో పీఆర్ డీఈఈ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంచాయతీరాజ్ సబ్–డివిజన్ (పీఆర్ఐ–2) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి సెలవులో వెళ్లారు. వైద్యుల సలహా మేరకు శుక్రవారం నుంచి నెల రోజుల పాటు సెలవు పెట్టారు. అప్పటి వరకు ఆ బాధ్యతలు సబ్‌డివిజన్–1 డీఈఈ రసూల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాగ్యరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రారంభమైన ఎల్ఐసీ వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: భారతీయ జీవితబీమా (ఎల్ఐసీ) బ్రాంచి–1, బ్రాంచి–2 కార్యాలయాల్లో శుక్రవారం వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హాజరైన ఐడీబీఐ మేనేజర్ ప్రభంజన్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బీమా రంగంలో కోట్లాది మంది ప్రజల విశ్వాసం చూరగొన్న సంస్థగా అభివర్ణించారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచి మేనేజర్ మధుబాబు, ఎల్ఐసీకి చెందిన వివిధ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు టీకాలు


ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య మాట్లాడుతూ.. ధనుర్వాతం, ఇతర వ్యాధులు రాకుండా టీకాలే వేశామన్నారు. పీహెచ్ఎన్ తులసమ్మ, సీహెచ్ఓ శమీమ్‌తార, ఏఎన్ఎంలు అలివేలమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జంప్ రోప్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు రేపు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ జంప్ రోప్ ఎంపిక పోటీలు ఈ నెల 3న నగరంలోని అశోక్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు ఈ నెల 9 నుంచి 10 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరగబోవు రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకొని రావాలని కోరారు.

ఆటో కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు

అనంతపురం అర్బన్: రికార్డులు లేవనో, రోడ్డు క్రాస్ చేశారనో, అంగళ్ల వద్ద నిలబెట్టారనో జరిమానాలు విధిస్తూ ఆటో కార్మికులను పోలీసులు ఇబ్బంది పెట్టకూడదని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.పెద్దన్న తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఏఐఎఫ్‌టీయూ ఆటోస్టాండ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటో నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం, పోలీసులు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజా, ఖాసీం, మూర్తి, నబిసాబ్, తదితరులు పాల్గొన్నారు.



మా బకాయి చెల్లించండి

రామగిరి: తమ బకాయి చెల్లించిన తర్వాతే పరిశ్రమలోని పాత ఇనుమ సామగ్రి తరలించాలని బీజీఎంఎల్ (భారత్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్) కార్మికులు అన్నారు. శుక్రవారం వారు రామగిరిలోని పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ... రామగిరి బంగారు గనులకు సంబంధించిన పాత వాహనాలు, ఇనుప సామగ్రి టెండరు దక్కించుకున్న ఓ కంపెనీ ఈనెల 4న పాత సామగ్రి తీసుకువెళ్లేందుకు సిద్ధమైందన్నారు. రామగిరి బంగారు గనుల్లో 180 మంది కార్మికులు అప్పట్లో చేసేవారమని, 2001లో బంగారు గనులు మూతపడగా తమ కుటుంబాలు వీధిన పడ్డాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికే కంపెనీ తమకు రూ.3 లక్షలు చొప్పున బకాయిలు పడిందన్నారు. అప్పట్లో తామంతా బెంగళూరు హైకోర్టును ఆశ్రయించగా, కార్మికుల బకాయిలు చెల్లించిన తర్వాతే గనులను తెరిచేందుకు సన్నద్ధం కావాలని కోర్టు 2012లో తీర్పు చెప్పిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో బీజీఎంఎల్ తెరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, తమ బకాయిలు చెల్లిస్తే గోల్డ్‌మైన్స్ తెరిపించేందుకు తామంతా పూర్తిగా సహకరిస్తామన్నారు. నాయకులు షాబ్‌జాన్, నారాయణ, పోతన్న, నాగరాజు, ఆంజనేయులు, ముత్యాలప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మికులు

పెద్దమ్మ తల్లీ పాహి.. పాహి



అలంకరణలో పెద్దమ్మ

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసంలో వచ్చిన మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రామనగర్‌లో పెద్దమ్మ తల్లిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీనివాసనగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి రజిత కవచాలంకారంలో పూజలు నిర్వహించి ఆరాధించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన నైవేద్యంతో మహిళలకు ఒడిబియ్యం పెట్టారు. అలాగే శివకోటి, శంకర మఠంలో శారదా మాత, చాముండేశ్వరి, చౌడేశ్వరీ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
556	182
65,387	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,251	▲	4
వెండి (కిలో)		
74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.01	106.40
€	యూరో	ఒకటి	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.21	62.17
SAR	సౌదీ రియాల్	ఖావచుకుకే	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	ఖావచుకుకే	21.62	23.42
¥	చైనా యువాన్	ఖావచుకుకే	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా-విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!




న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్ఠానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016-2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే



అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.

నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్ - 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ - 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్-ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4-1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్-30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-1, 7-6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6-2, 6-2, 6-7 (6/8), 6-2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6-3, 6-2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకెల్ మో 3-6, 4-6, 7-6 (7/3), 6-4, 7-6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు - నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) - డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3-6, 5-7తో హ్యూగో నిస్ (మొనాకో) - జిలిన్స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) - కరట్సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో లాస్లో జెరె (సెర్బియా) - హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**



కుమారుడితో ఇస్నర్